**ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ),**

**కమిషనర్ వారి కార్యాలయము, లెనిన్ సెంటర్, గవర్నరుపేట, విజయవాడ- 520002.**

పత్రికా ప్రకటన

తేదీ: 15.03.2025

రైతు సమస్యల పరిష్కారానికే సిఆర్‌డిఏ తొలి ప్రాధాన్యం

గడువులోపు పరిష్కరించాలని అధికారులకు కమిషనర్ కె. కన్నబాబు ఆదేశం

సిఆర్‌డిఏ పరిధిలో రైతు సమస్యల పరిష్కారం పూర్తిగా వారు సంతృప్తి చెందేవిధంగా ఉండాలని కమిషనర్ కె. కన్నబాబు అన్నారు. అదనపు కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్‌తో కలసి ఆయన శనివారం విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ నమోదు చేసిన రైతులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకవైపు రైతు సమస్యలు తెలుసుకుంటూనే మరోవైపు సంబంధిత అధికారులతో చర్చించారు. అవకాశం ఉన్నవి అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతావి గడువులోగా పూర్తి సంతృప్త స్థాయిలో పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను అదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టల్ లో 93 సమస్యలు నమోదు కాగా సంబంధిత రైతులందరినీ పిలిచి మాట్లాడారు. వాటిల్లోఇప్పటికే పరిష్కారం అయిన వాటిమీద కూడా రైతుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. ఇక ముందు ప్రతి శుక్రవారం తుళ్లూరులో జరిగే గ్రీవెన్స్ డే తో పాటుగా ప్రతి శనివారం విజయవాడ సిఆర్‌డిఏ ఆఫీసులో స్వయంగా తానే ఈ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. రైతు సమస్యల పరిష్కారమే తమ తొలి ప్రాధాన్యమని అందుకే ఈ విధంగా గ్రీవెన్స్ ని వీలైనంత త్వరగా ఎక్కడికక్కడ పరిష్కరిస్తున్నామని చెప్పారు. రైతుల నుంచి నేరుగానే కాకుండా ఆన్ లైన్ విధానంలో కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. దరఖాస్తు అందినప్పటి నుంచి అది పరిష్కారమయ్యే దాక ఎప్పటికప్పుడు రైతుల ఫోన్లకు మెసేజ్ వెళ్తుందని చెప్పారు. పలువురు రైతులు గ్రామకంఠం భూముల సమస్యల గురించి ప్రస్తావించగా వాటిని ప్రాధాన్యతాక్రమంలో వీలైనంత తొందరగా పరిష్కరించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు ఎక్కువగా రిటర్నబుల్ ప్లాట్లు, కౌలు చెల్లింపు, సీఆర్డీఏ పింఛన్ తదితర అంశాలపై తమ సమస్యలు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఇంకా సీఆర్డీఏ ల్యాండ్స్ అండ్ ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, వివిధ విభాగాల సిబ్బంది హాజరయ్యారు.

కమిషనర్ కార్యాలయం,

ఏపీ సిఆర్డీఏ.



